క్లుప్తంగా

నీట్ ఫలితాల్లో అనూష ప్రతిభ



రేగొండ: నీట్ పరీక్ష ఫలితాల్లో రేగొండ మండలంలోని మడ్తపల్లి గ్రామానికి చెందిన జంగిలి అనూష 720 మార్కులకు 500 మార్కులు సాధించి ప్రతిభ చాటింది. అనూష తల్లిదండ్రులు జంగిలి సుమలత సుధాకర్‌లు వ్యవసాయం చేస్తుంటారు. కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ కాలేజీలో ఇంటర్మీడియట్ పూర్తి చేసింది. పదో తరగతి వరకు వరంగల్‌లోని నవోదయలో చదువుకుంది. అనూష మంచి ర్యాంకు సాధించడంపై గ్రామస్తులు, కుటుంబ సభ్యులు అభినందనలు తెలిపారు.

'బడిబాట' ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

కాళేశ్వరం: మహదేవపూర్ మండలంలోని అన్నారం, కుదురుపల్లి, పలుగుల తదితర గ్రామాల్లో అంగన్‌వాడీ సిబ్బంది ఆధ్వర్యంలో శనివారం బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. రెండున్నర సంవత్సరాల నుంచి ఐదు సంవత్సరాల లోపు పిల్లలను అంగన్‌వాడీల్లో చేర్చాలని ర్యాలీ తీశారు.

పరామర్శ



పరామర్శిస్తున్న ఎమ్మెల్యే గండ్ర

గణపురం: మండలంలోని బుద్దారం గ్రామానికి చెందిన నల్లబెల్లి దేవేందర్ రావు అనారోగ్యంతో దామెర క్రాస్ వద్ద ఉన్న ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. దీంతో బాధితుడిని ఎమ్మెల్యే గండ్ర సత్యనారయణరావు శనివారం పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకొని మెరుగైన వైద్యం అందించాలని సూచించారు.

మల్హర్‌లో..



పెద్దతూండ్లలో పరామర్శిస్తున్న పుట్ట మధు

మల్హర్: మండలంలోని మల్లారానికి చెందిన సమ్మరావు, సదానందం, పెద్దతూండ్ల కిషన్ రావుపల్లిలో మోక్షశ్రీ, రాజకొమురయ్య, రుద్రారంలో ఓదెలు, లింగమ్మ, రాజమల్లు, ఎడ్లపల్లిలో ఎల్లమ్మ ఇటీవల మృతిచెందారు. దీంతో బాధిత కుటుంబ సభ్యులను మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు శనివారం పరామర్శించారు. అలాగే ఎడ్లపల్లిలో అనారోగ్యంతో బాధపడుతున్న పోతరాజును పరామర్శించి, ఆరోగ్య వివరాలను అడిగి తెలుసుకున్నారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కుంభం రాఘవరెడ్డి, మాజీ జెడ్పీటీసీ గోనె శ్రీనివాసరావు, నాగేశ్వర్‌రావు, బాలజీ, సతీష్‌తో పాటు తదితరులు ఉన్నారు.

ఆర్థిక సాయం

ములుగు రూరల్: ములుగు మున్సిపాలిటీ పరిధిలోని మదవరావుపల్లికి చెందిన ముప్పిడి లక్ష్మి అనారోగ్యంతో ఇటీవల మృతి చెందింది. దీంతో బాధిత కుటుంబాన్ని కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు వంగ రవియాదవ్ పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. ఆయన వెంట గందె శ్రీను, గందె రాజు, మైదం బాబురావు, తదితరులు ఉన్నారు.

ప్రమాదకరంగా కల్వర్టు

- ఇబ్బందిపడుతున్న గ్రామస్తులు, వాహనదారులు
- పట్టించుకోని అధికారులు



ప్రమాదకరంగా ఉన్న కల్వర్టు

చిట్యాల: మండల కేంద్రంలోని వెంకట్రావుపల్లి(సీ) గ్రామంలో మలుపు వద్ద కల్వర్టు ప్రమాదకరంగా మారింది. గతంలో వెంకట్రావుపల్లి (సీ) నుంచి తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లే దారి గుండా ఆర్ అండ్‌బీ అధికారులు తారురోడ్డు నిర్మాణం చేపట్టారు. దీంతో గ్రామంలో మలుపు వద్ద రోడ్డు నిర్మాణం చేపట్టకపోవడంతో పాటు కల్వర్టును అసంపూర్తిగా వదిలేయడంతో వాహనదారులు అనేక అవస్థలు పడుతున్నారు. ప్రతీ రోజు ఈ రోడ్డుపై అధిక సంఖ్యలో వాహనాలు వెళ్తుంటాయి. రోడ్డు క్రాసింగ్ వద్ద భారీ వాహనాలు వెళ్లాలంటే అనేక ఇబ్బంది పడాల్సి వస్తుంది. ఏమైనా భారీ వాహనాలు ఎదురెదురుగా వస్తే రెండు వాహనాలు ఢీకొనే పరిస్థితి ఉంది. కల్వర్టు దగ్గర ఆర్అండ్‌బీ అధికారులు ఏలాంటి ప్రమాద సూచిక బోర్డు ఏర్పాటు చేయలేదు. కాగా, జీపీ సిబ్బంది పోలీస్ స్టేషన్‌కు సంబంధించిన భారికెడ్‌ను తీసుకువచ్చి కల్వర్టు దగ్గర ఉంచగా అది కూడా కాల్వలో పడిపోయింది. దీంతో ఏలాంటి హెచ్చరిక బోర్డు లేకపోవడంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. అలాగే వర్షాల మూలంగా మలుపు వద్ద బురదమయంగా మారి గ్రామస్తులకు ఇబ్బందికంగా ఉంది. కావున సంబంధిత అధికారులు స్పందించి కల్వర్టుపై సిమెంట్ బిల్ల వేయాలని, అలాగే రోడ్డుకు మరమ్మతు చేయాలని గ్రామస్తులు, వాహనదారులు కోరుతున్నారు.

నాన్న ప్రోత్సాహంతోనే..

నాన్న ప్రోత్సాహంతోనే ముందుకు వెళ్తున్నామని, తమ తండ్రి పడిన కష్టానికి ఫలితం దక్కిందని పలువురు కుమారులు తెలుపుతున్నారు. తండ్రి స్ఫూర్తితో ఎదిగిన పలువురి గురించి..

నేడు(ఆదివారం)ఫాదర్స్ డే సందర్భంగా 'సాక్షి' ప్రత్యేక కథనం..

ఇద్దరి కుమారులను తీర్చిదిద్దాడు..



చిట్యాల: ఈ ఫొటోలో ఇద్దరు కుమారులతో ఉన్న పర్లపెల్లి ఒదేలు మండలంలోని నవాబుపేట గ్రామం. గతంలో సెంట్రింగ్ మేస్త్రీగా పని చేసుకుంటూ పిల్లలను చదివించాడు. కూలీ పని చేసుకుంటూనే 2009లో ఆర్టీసీలో కండక్టర్‌గా ఉద్యోగంలో చేరి అరకొర వేతనంతో అప్పులు తీసుకుని కుటుంబాన్ని పోషించాడు. ఇద్దరు కుమారుల్లో పెద్ద కుమారుడు కల్యాణ్ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా హైదరాబాద్‌లో కొనసాగుతుండగా, చిన్న కుమారుడు గణేష్ ఎంబీఏస్ పూర్తి చేసి, పీజీ కోసం సన్నద్ధమవుతున్నాడు. నాన్న ప్రోత్సాహంతోనే స్థిరపడుతున్నామని కల్యాణ్, గణేష్ అంటున్నారు.

హమాలీ పని చేస్తూ..



టేకుమట్ల: మండల కేంద్రానికి చెందిన మారెపెల్లి కొమురయ్య–తిరుపతమ్మ దంపతులకు ఇద్దరు కుమారులు. కొమురయ్య హమాలీ పని చేస్తుండగా తిరుపతమ్మ అంగన్‌వాడీ టీచర్‌గా విధులు నిర్వర్తిస్తోంది. వారి చిన్న కుమారుడు చక్రవర్తిని డాక్టర్‌ను చేయాలనే సంకల్పంతో కొమురయ్య హమాలీ పని చేస్తూ చదివించాడు. తండ్రి ఆశయాన్ని చక్రవర్తి నెరవేర్చేందుకు కష్టపడి ఎంబీబీఎస్‌లో సీటు సంపాదించాడు. ప్రస్తుతం మహబూబ్‌నగర్ రిమ్స్ మెడికల్ కళాశాలలో తృతీయ సంవత్సరం చదువుతున్న చక్రవర్తి ఎంబీబీఎస్ తనకు నాన్న ఇచ్చిన బహుమతి అని అంటున్నాడు.

ఉన్నతమైన విద్య అందించడమే లక్ష్యం



బడిబాట ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

భూపాలపల్లి రూరల్: సామాన్యుల పిల్లలకు ఉన్నతమైన విద్యను అందించడమే సింగరేణి లక్ష్యమని సింగరేణి పాఠశాల కరస్పాండెంట్ కావూరి మారుతి తెలిపారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా భూపాలపల్లి సింగరేణి ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు శనివారం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మారుతి మాట్లాడుతూ.. ఈ ఏడాది పదో తరగతిలో 100 శాతం ఉత్తీర్ణత సాధించామన్నారు. ప్రధానోపాధ్యాయురాలు ఝాన్సీ రాణి మాట్లాడుతూ.. విద్యనే కాకుండా క్రీడల కూడా ప్రోత్సహించడానికి గ్రౌండ్, విశాలమైన క్లాస్ రూమ్‌లు ఉన్నాయన్నారు. జీఎం రాజేశ్వరరెడ్డి పాఠశాలకు కావల్సిన సామగ్రిని సమకూర్చారన్నారు.

ఎస్సైలకు సన్మానం



ఎస్సై సతీష్‌ను సన్మానిస్తున్న నాయకులు

వాజేడు: బదిలీపై వాజేడుకు వచ్చిన ఎస్సై సతీష్, బదిలీపై వెళ్తున్న ఎస్సై రాజ్ కుమార్‌లను కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి విక్రాంత్ ఆధ్వర్యంలో శనివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో సన్మానించారు. మాజీ సర్పంచ్ తల్లడి ఆదినారాయణ, సొసైటీ ఉపాధ్యక్షుడు జగన్నాథరాజు, షాబీర్ పాషా, సాయి కళ్యాణ్, ఖాజావలి, రామ కృష్ణ, వెంకటేశ్వర్లు ఉన్నారు.

ఏటూరునాగారంలో..



ఎస్సైని సన్మానిస్తున్న నాయకులు

ఏటూరునాగారం: ఎస్సైగా బాధ్యతలను చేపట్టిన రాజ్‌కుమార్‌ను స్థానిక బీఆర్ఎస్ నాయకులు శనివారం సన్మానించారు. మండల అధ్యక్షుడు గడదాసు సునీల్‌కుమార్, తాడూరి రఘు, నర్సయ్య, మల్లారెడ్డి, నాగరాజు, వెంకటేశ్వర్లు, కిరణ్,నాగరాజు, చిప్ప నాగరాజు ఉన్నారు.

హెల్మెట్‌తో వాహనదారులకు రక్షణ



కన్నాయిగూడెం: అవగాహన కల్పిస్తున్న ఎస్సై వెంకటేశ్

- ఎస్సై వెంకటేశ్

కన్నాయిగూడెం: ద్విచక్రవాహనదారులకు హెల్మెట్‌తో రక్షణ ఉంటుందని ఎస్సై వెంకటేశ్ తెలిపారు. శనివారం మండలంలోని ముప్పనపల్లి వద్ద ఎస్సై వాహనాలను తనిఖీ చేశారు. అనంతరం వాహనదారులకు హెల్మెట్ ధరించడం వలన కలిగే లాభాల గురించి అవగాహన కల్పించారు. వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు.

గోవిందరావుపేట/వాజేడు/వెంకటాపురం(కె): ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని పస్రా ఎస్సై అచ్చ కమలాకర్, వాజేడు, పేరూరు ఎస్సైలు జక్కుల సతీష్, గుర్రం కృష్ణ ప్రసాద్, వెంకటాపురం(కె) ఎస్సై కొప్పుల తిరుపతి రావు వేర్వేరు ప్రకటనలో తెలిపారు. వెయ్యి రూపాయల హెల్మెట్ ఖర్చు కోసం ఆలోచించకండి.. ప్రాణాలను పణంగా పెట్టకండి అని అన్నారు. హెల్మెట్ ధరించకపోతే జరిమానాతో పాటు వాహనాలు సీజ్ చేస్తామని హెచ్చరించారు. వాహనాలకు సంబంధించిన పత్రాలు తప్పనిసరిగా ఉండాలని హెచ్చరించారు. నేటి(ఆదివారం) నుంచి స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమి పూజ



భూమి పూజలో పాల్గొన్న నాయకులు

టేకుమట్ల: రాష్ట్ర ప్రభుత్వం నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయగా మండలంలోని రాఘవరెడ్డిపేటలో ఇళ్ల నిర్మాణానికి భూమి పూజ కార్యక్రమాన్ని శనివారం చేపట్టారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కోటగిరి సతీష్‌గౌడ్ హాజరై భూమి పూజలో పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధకారంలోకి రాగానే ప్రజలకిచ్చిన హామీ ప్రకారం ఇళ్లను మంజూరు చేసిందని అన్నారు. దళారుల ప్రమేయం లేకుండానే నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో ఇంటి బిల్లు జమ చేసేలా ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని సంక్షేమ పథకాలతో కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతుందని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో డబుల్ బెడ్రూం ఇళ్లు ఇస్తామని 10 సంవత్సరాల కాలంలో ఇచ్చిన దాఖలాలే లేవన్నారు. మాజీ సర్పంచ్ వంగ కుమారస్వామి, గ్రామ శాఖ అధ్యక్షులు రామన్న, నాయకులు వంగ ప్రభాకర్, లబ్ధిదారులు పాల్గొన్నారు.

దరఖాస్తు చేసుకోవాలి

కాళేశ్వరం: రైతు భరోసా పథకం కోసం కొత్తగా పట్టాలు పొందిన రైతులు జూన్ 20 లోపు దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి సుప్రజ్యోతి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసే రైతులు తప్పనిసరిగా వ్యవసాయ శాఖ సుంచించిన ఫారం, పట్టాదారు పాస్ బుక్ జిరాక్స్, ఆధార్ కార్డు జిరాక్స్, బ్యాంక్ అకౌంట్ పాస్ బుక్ జిరాక్స్‌ను వ్యవసాయ విస్తరణాధికారులకు ఇవ్వాలని కోరారు.

ఆరోపణలు చేయడం సరికాదు

- కాంగ్రెస్ యూత్ మండల అధ్యక్షుడు క్రాంతి



మాట్లాడుతున్న చింత క్రాంతి

గోవిందరావుపేట: ప్రజల సంక్షేమం కోసం కృషి చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వంపై బీఆర్ఎస్ నాయకులు ఆరోపణలు చేయడం సరికాదని కాంగ్రెస్ మండల యూత్ అధ్యక్షుడు చింత క్రాంతి అన్నారు. మండల కేంద్రంలో శనివారం నిర్వహించిన పార్టీ యువ నాయకుల సమావేశంలో చింత క్రాంతి మాట్లాడుతూ.. సంక్షేమ పథకాలు అందించే వారి మీద నిందలు వేయడం సిగ్గుచేటు అన్నారు. పది సంవత్సరాల్లో నియోజకవర్గంలో బీఆర్ఎస్ నాయకులు పేద ప్రజలకు ఇళ్లు ఇవ్వలేదు కానీ ఇప్పుడు మాట్లాడుతున్నారని తెలిపారు. ఇప్పటికైనా బీఆర్ఎస్ నాయకులు వారి పద్ధతి మార్చుకోవాలని హెచ్చరించారు.

చెట్టును ఢీకొట్టిన కంటైనర్



రోడ్డుకు మధ్యలో ఉన్న కంటైనర్ వాహనం

ఏటూరునాగారం: మండలంలోని చిన్నబోయినపల్లి అటవీ ప్రాంతం తాడ్వాయి సమీపంలో గల 163 జాతీయ రహదారిపై హైదరాబాద్ నుంచి ఛత్తీస్‌గఢ్ వెళ్లే ఒక పెద్ద కంటైనర్ చెట్టుకు ఢీకొని మధ్యలో శనివారం రాత్రి ఇరుక్కుపోయింది. కంటైనర్ చెట్టుకు ఆనుకొని ఉండగా దాని ఇంజన్ రోడ్డు మధ్యలో నిలిచిపోయింది. దీంతో వాహనాలు రెండు వైపులా కిలోమీటర్ల మేర నిలిచిపోయాయి. కొంతమంది డ్రైవర్లు వాహనం కంటైనర్ మధ్యలో ఉన్న లింక్‌ను తొలగించి వాహనం ఇంజన్‌ను విడదీయడంతో ట్రాఫిక్ క్లియర్ కాగా వాహనాలు వెళ్లిపోయాయి. కంటైనర్ మాత్రం అడవిలో ఉండిపోయింది. అక్కడ నుంచి ఎవరికైనా సమాచారం ఇద్దామన్న ఎలాంటి సెల్‌ఫోన్ సిగ్నల్స్ లేకపోవడంతో వాహనంలోని డ్రైవర్లు, క్లియర్స్ రాత్రి అంతా కూడా బిక్కు బిక్కుమంటూ గడపాల్సి వచ్చింది. ఈ విషయాన్ని సోషల్‌మీడియాలో వైరల్ కావడంతో పోలీసులు స్పందించినట్లు సమాచారం.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

రేగొండ: మండలంలోని రావులపల్లి, గడిపల్లి,పెద్దంపల్లి గ్రామాల్లో విద్యుత్ తీగల కింద చెట్టు కొమ్మల తొలగింపు ప్రక్రియలో భాగంగా నేడు (ఆదివారం) ఉదయం 8.30 గంటల నుంచి ఉదయం 11.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ లైన్‌మెన్ విజయ్ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

రక్తదాన శిబిరం



రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న తహసీల్దార్

వెంకటాపురం(కె): మండల కేంద్రంలోని ఆర్అండ్‌బీ అతిథి గృహం ఆవరణంలో చేయూత స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు చిడెం సాయి ప్రకాశ్ జ్ఞాపకార్థం వెంకటాపురం యూత్ ఆధ్వర్యంలో శనివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ రక్తదాన శిబిరాన్ని తహసీల్దార్ వేణుగోపాల్ ప్రారంభించారు. కాగా, 30 మంది యువకులు రక్తదానం చేయడంతో మోమెంటోలను అందజేశారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ అధ్యక్షుడు చిడెం మోహనరావు, చిడెం సాయితేజా, నాని, మధు, మురళి, చిడెం శివ, యాలం సాయి, మాధూరి ఉన్నారు.

'బెదిరింపులకు పాల్పడితే ఊరుకోం..'

వెంకటాపురం(కె): బహుజనులను ఇసుక రేజింక్ కాంట్రాక్టర్లు అధికార పార్టీ నాయకుల పేరు చెప్పి బెదింపులకు పాల్పాడితే ఊరుకునేదిలేదని బహుజన సమాజ్ వాదీ పార్టీ జిల్లా అధ్యక్షుడు తడికల శివ అన్నారు. శనివారం మండల పరిధిలోని బోదాపురం పంచాయతీ రామన్నగూడెం ఇసుక రీచ్‌ను బీఎస్పీ బృందం పరిశీలించి మాట్లాడారు. ఆలుబాక గ్రామానికి చెందిన బోల్లె సతీష్ వద్ద ఇసుక రేజింగ్ కాంట్రాక్టర్ స్టాక్ యార్డుకోసం డబ్బులు ఇస్తానని భూమి తీసుకుని డబ్బులు ఇవ్వకుండా బెదిరింపులకు పాల్పడుతున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. స్టాక్ యార్డుకు తీసుకున్నందుకు డబ్బులు అడిగితే అధికార పార్టీ నాయకులు పేరుతో బెదిరింపులకు పాల్పడుతున్నాడని ఆరోపించారు. ఈ విషయం పై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. సతీశ్‌కు న్యాయం జరిగే వరకు బీఎస్పీ అండదగా ఉంటుందని అన్నారు. కేశవ రావు, చంద్ర ప్రసాద్‌నందు తదితరులు ఉన్నారు.

'పుట్ట మధుపై అనుచిత వ్యాఖ్యలు సరికావు'

కాటారం: కాంగ్రెస్ నాయకులు వారి హక్కులను వారు పొందాలని బానిసలుగా కాకుండా పదవుల్లో రాణించాలని సలహా ఇచ్చిన మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుపై కాంగ్రెస్ నాయకులు అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని మండల బీఆర్ఎస్ ఇన్‌చార్జ్ జోడు శ్రీనివాస్, యూత్ అధ్యక్షుడు రామిళ్ల కిరణ్ అన్నారు. మండల కేంద్రంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీలో ఉంటూ పదవులు అడగలేని దీనస్థితిలో ఆ పార్టీ నాయకులు ఉన్నారని విమర్శించారు. పుట్ట మధుకు ఈ నియోజకవర్గ ప్రజలతో ఉన్న సంబంధం ఓటు సంబంధం కాదని పేగు సంబంధం అని అందులో భాగంగానే ఏ పార్టీలోనైన కష్టపడిన నాయకుడికి గౌరవం దక్కాలని ఆయన కోరుకుంటారని అన్నారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు జక్కు శ్రావణ్, కొండగొర్ల వెంకటస్వామి, ఉప్పు సంతోష్, మానెం రాజబాబు, కొండపర్తి రవి, రజాకర్, పైడాకుల మహేందర్, సతీశ్, సంపత్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

నాసిరకం సీడ్స్‌పై నజర్



విత్తన దుకాణంలో తనిఖీ చేస్తున్న ఏఓ మహేష్



పేరూరులో రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

- అధికారుల తనిఖీలు ముమ్మరం
- విత్తనాల కొనుగోలుపై అవగాహన
- రైతులను మోసం చేస్తే చట్టపరమైన చర్యలకు సిద్ధం

వాజేడు : ఆరుగాలం కష్టించి అన్నం పెట్టే రైతన్న ఆది నుంచే దగా పడుతున్నాడు. విత్తనాల కొనుగోలు నుంచి పండిన పంట అమ్ముకునే వరకు ఏదో ఒక రూపంలో నష్టాలకు గురికాక తప్పడం లేదు. గత ఏడాది నాసిరకం విత్తనాలతో మొక్కజొన్న, మిర్చి పంటలను సాగు చేసిన రైతుల్లో వందలాది మంది తీవ్రంగా నష్టపోయారు. దీంతో ప్రభుత్వం ముందు నుంచే నకిలీ విత్తనాలను విక్రయించినా, తయారు చేసినా చట్టపరంగా పీడీ యాక్ట్ అమలు చేస్తామని హెచ్చరికలు జారీ చేయడంతో పాటు ప్రత్యేకంగా విజిలెన్స్‌ను ఏర్పాటు చేసి తనిఖీలను ముమ్మరం చేసింది. వ్యవసాయ పనులు ప్రారంభం అవుతుండడంతో ముందు నుంచే నకిలీ విత్తనాలపై అటు ప్రభుత్వం ఇటు అధికారులు ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించారు.

అధికారుల తనిఖీ

విజిలెన్స్ అధికారులతో ప్రత్యేకంగా తనిఖీ బృందాలను ఏర్పాటు చేసి తనిఖీలను నిర్వహిస్తున్నారు. మండలంలోని విత్తన దుకాణాల అధికారులు తనిఖీ చేసి ఏఏ విత్తనాలను విక్రయిస్తున్నది పక్కాగా చూస్తున్నారు. అదే సమయంలో వాటిని ఎక్కడ కొనుగోలు చేశారు. ఆ విత్తనాల మొలకశాతం ఎంత అనే విషయాలను క్షుణ్ణంగా పర్తిశీలిస్తున్నారు. విత్తనాలను ఎవరెవరికి విక్రయిస్తున్నారో వారి పేర్లను నమోదు చేయాలని దుకాణదారులకు సూచిస్తున్నారు. విత్తనాలు కొనుగోలు చేసిన రైతు ఫోన్‌నంబర్ తప్పనిసరిగా తీసుకోవాలని సూచనలు ఇస్తున్నారు.

ప్రత్యేక అవగాహన

రైతులకు విత్తనాలు కొనే విషయంలో అధికారులు ప్రత్యేకంగా అవగాహన కల్పిస్తున్నారు. కొనుగోలు చేసే విత్తనాలు ఏ కంపెనీవి, వాటి మొలకశాతం ఎంత, నమ్మకమైన విత్తనాలేనా, అని ఆలోచించుకొని కొనుగోలు చేయాలని చెబుతున్నారు. లూజు విత్తనాలను కొనుగోలు చేయొద్దని, కంపెనీ లేబుల్ లేని విత్తనాలను తీసుకోవద్దని తెలుపుతున్నారు. నాణ్యమైన విత్తనాలనే కొనుగోలు చేసుకోవాలని సూచనలను చేస్తున్నారు. అందుకు సంబంధించి కరపత్రాలను సైతం పంపిణీ చేస్తున్నారు.

రైతులతోనే తోటల పెంపకం చేపట్టాలి

ఏటూరునాగారం: పోడు భూముల్లో పండ్ల మొక్కలను పెంచి వాటి ఫలాలు రైతులకే దక్కేలా చూడాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చిటమట రఘు అన్నారు. అటవీశాఖ రేంజ్ అధికారి అబ్దుల్ రెహమాన్‌ను శనివారం రఘు నాయకులతో కలిసి మాట్లాడారు. మండలంలోని చిన్నబోయినపల్లిలో పోడు చేసుకున్న రైతుల భూముల్లో పండ్ల మొక్కలను నాటుతామని చెప్పి మోసం చేయొద్దని, ఆ భూముల్లో వారితోనే పంట్ల తోటల పెంపకాన్ని చేపట్టాలని అధికారులను కోరారు. ఉసిరి, నేరేడు, కుంకుడు, వేప, వెదురు ఇతర మొక్కలను వారితోనే నాటించాలన్నారు. రైతులు ఎన్నో ఏళ్ల నుంచి భూమి సాగు చేసుకొని జీవిస్తున్నారు. అలాంటి భూముల్లో రైతులను భాగస్వాములు చేయాలని వివరించారు. కార్యక్రమంలో రోడ్డు రవాణా డైరెక్టర్ వసంత శ్రీనివాస్, గౌస్, చేల వినయ్ ఉన్నారు.

గుంత తీశారు.. వదిలేశారు



తీసి వదిలేసిన గుంత

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరం ఎస్సీ కాలనీలో పంచాయతీ అధికారులు రెండు రోజుల క్రితం గుంత తీసి వదిలేశారు. దీంతో శనివారం పలువురు గుంతలో పడ్డారని స్థానికుడు నార ఈశ్వర్ తెలిపాడు. ప్రమాదరకంగా ఉన్న గుంతను అధికారులు వెంటనే పూడ్చివేయాలని కోరారు.